## క్లుప్తంగా

### శ్రీవేంకటేశ్వర ఆలయ హుండీల ఆదాయం లెక్కింపు



లెక్కిస్తున్న గోవిందపతి సేవకులు

కరీంనగర్ కల్చరల్: మార్కెట్ రోడ్‌లోని శ్రీవేంకటేశ్వర ఆలయం హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. రూ.15,71,953 సమకూరినట్లు ఈవో సుధాకర్ తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన లెక్కింపులో ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, గోవిందపతి సేవకులు పాల్గొన్నారు.

### జెడ్పీ పాఠశాలల తనిఖీ



మొగ్దుంపూర్ జెడ్పీ పాఠశాలలో ప్రత్యేక తరగతులు తనిఖీ చేస్తున్న ఎంఈవో రవీందర్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని జూబ్లీనగర్, చామనపల్లి, మొగ్దుంపూర్ జెడ్పీ పాఠశాలలను గురువారం ఎంఈవో కె.రవీందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జూబ్లీనగర్ పాఠశాలలో జన్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విటమిన్ గార్డెన్‌ను పరిశీలించారు. ప్రణాళిక ప్రకారం పెంచుతున్న కూరగాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చామనపల్లి, మొగ్దుంపూర్ జెడ్పీ పాఠశాలల్లో పదో తరగతి ప్రత్యేక తరగతులను తనిఖీ చేశారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జలజరాణి, పద్మ పాల్గొన్నారు.

### 'బాపు' సినిమా పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్ జిల్లాకు చెందిన రాజు, భానుప్రసాద్‌రెడ్డిలు సంయుక్తంగా కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై దయా దర్శకత్వంలో నిర్మించిన 'బాపు' చలన చిత్ర పోస్టర్‌ను కరీంనగర్ ఫిలిం సొసైటీ బాధ్యులు గురువారం రాత్రి కఫిసా భవన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోల రామచంద్రరెడ్డి, నటుడు సదాశ్రీ, రచయితలు గాజోజు నాగభూషణం, కందుకూరి అంజయ్య, అన్నవరం దేవేందర్, కూకట్ల తిరుపతి, శంకరయ్య పాల్గొన్నారు.

### శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవాలు ప్రారంభం

చొప్పదండి: మండలంలోని రాగంపేట గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వార్షికోత్సవాలకు ముస్తాబైంది. గురువారం యాగశాల ప్రవేశం అగ్ని ప్రతిష్ఠతో ధ్వజారోహణం గావించారు. శుక్రవారం విష్ణు సహస్ర నామ పారాయణం, శనివారం ఎదుర్కోలు, ఆదివారం ఉదయం శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. సోమవారం సుదర్శన నారసింహ హోమంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

### నేడు ఈజీఎస్ సామాజిక తనిఖీ

హుజూరాబాద్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సామాజిక తనిఖీ నిర్వహించనున్నామని ఎంపీడీవో తూర్పాటి సునీత గురువారం ప్రకటనలో తెలిపారు. 19 గ్రామ పంచాయతీలకు సంబంధించి 2023–24 సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీపనులు, 15వ విడత చేపట్టనున్న పనులపై సమావేశం జరుగుతుందన్నారు.

## యూనియన్ గుర్తింపును పునరుద్ధరించాలి



ధర్నా చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

కరీంనగర్: భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)లో క్లాస్–3, 4 కేడర్లలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, రద్దు చేసిన యూనియన్ గుర్తింపును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఉద్యోగులు గురువారం గంట పాటు విధులు బహిష్కరించి సమ్మె చేశారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ డివిజనల్ ఆఫీస్ ఎదుట నిర్వహించిన ధర్నాలో డివిజన్ అధ్యక్షుడు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే దిశలో భాగంగా ప్రభుత్వం ఐఆర్‌డీఏఐను ఉపయోగిస్తూ ఎల్ఐసీ మీద దాడి చేస్తోందని అన్నారు. ఉద్యోగులపై పడుతున్న అదనపు భారాన్ని పరిగణలోకి తీసుకోవడం లేదని తెలిపారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ పెన్షనర్స్ అసోసియేషన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతం మాట్లాడుతూ అనేకతరాలుగా ఉద్యోగులు చేసిన గొప్ప సేవ ఫలితంగానే ఎల్ఐసీ ఈ స్థాయికి చేరి దేశానికి ఆర్థిక వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. ఉద్యోగుల నియామకాలు చేపట్టాలని, యూనియన్ చేసే పోరాటాలకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు వామన్‌రావు, సూర్యకళ, సత్తయ్య, బసవేశ్వర్, అనుపమ శ్రీలత, డీవో యూనిట్ నాయకులు మహేశ్, ప్రభాకర చారి, బ్రాంచ్–1 నాయకులు డి.శ్రీనివాస్, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సేవ చేయడం సంతోషకరం

కరీంనగర్: పేదలకు సేవ చేయడం సంతోషించదగ్గ విషయమని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని లయోలా మహిళా కళాశాల ప్రాంగణంలో ఫాలిమానగర్ అడోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో విభిన్న సామర్థ్యం గల వ్యక్తులకు ట్రై సైకిళ్లు, వీల్‌చైర్లు, చేతికర్రలు, వినికిడి పరికరాలు పంపిణీ చేశారు. దివ్యాంగుల హక్కులు, చట్టాల గురించి వివరించారు. సంస్థ దివ్యాంగుల అభివృద్ధి కొరకు పనిచేస్తుందని కొనియాడారు. మహిళా సంక్షేమ అధికారి సబిత మాట్లాడుతూ వికలాంగులకు లోపం ఉందని చిన్న చూపు చూడొద్దని, సహాయ సహకారాలు అందిస్తే గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దబడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ జడ్జి సరళరేఖ, మదర్ అనిస్, ప్రాజెక్టు డైరెక్టర్ ప్రీత, దీప్తి, షారోన్, లయోలా కాలేజ్ ప్రిన్సిపాల్ ఫాదర్ అలెక్స్, సెయింట్ అల్ఫోన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ సంతోష్, సంస్థ ప్రతినిధులు మర్రి మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, రూప, స్రవంతి, మౌనిక, సరిత, పద్మ, జమున తదితరులు పాల్గొన్నారు.



ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న సివిల్ జడ్జి వెంకటేశ్, తదితరులు

## నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలి

కరీంనగర్‌రూరల్: ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని హౌజింగ్‌బోర్డు డీఎం గంగాధర్ అన్నారు. గురువారం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన కరీంనగర్ మండలం బహుదూర్‌ఖాన్‌పేటలో ఎంపికైన 106 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం కోసం శుక్రవారం నుంచి ముగ్గులు పోసి పనులు ప్రారంభించాలన్నారు. సర్వే సందర్భంగా చూపించిన ఖాళీ స్థలంలో మాత్రమే ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఇంటిని 400 చదరపు అడుగుల వరకు నిర్మించుకోవాలని, విడతల వారీగా రూ.5 లక్షలు అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పలువురు లబ్ధిదారుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేందర్‌తో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న హౌజింగ్ డీఎం గంగాధర్

## వ్యవసాయేతర భూముల ఆన్‌లైన్

- వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

కరీంనగర్‌రూరల్: వ్యవసాయేతర భూముల పూర్తి వివరాలను గురువారం నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను రెవెన్యూ, వ్యవసాయాధికారులు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పథకం అమలు చేసేందుకు సాగు భూముల వివరాల సేకరణ చేపట్టింది. గత నెల 16 నుంచి 20 వరకు ఏఈవోలు కరీంనగర్ మండలంలోని 14 రెవెన్యూ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. మొత్తం 18,920 ఎకరాల వ్యవసాయ భూములుండగా ఏఈవోలు సర్వే చేసి 1,317 వ్యవసాయేతర భూములను గుర్తించారు. మిగితా 17,605 ఎకరాలకు రైతుభరోసా మంజూరుకు అర్హతగా నిర్ణయించారు. అయితే ప్రభుత్వం ప్రస్తుతం ఏఈవోలు గుర్తించిన వ్యవసాయేతర భూముల్లోని వివరాలను ఆన్‌లైన్ చేసేందుకు అవకాశం కల్పించింది. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజు, ఏవో సత్యం, ఏఈవో పైడితల్లి వ్యవసాయేతర భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఒక్కో గ్రామంలోని వ్యవసాయేతర భూమిలో ఉన్న నిర్మాణాలు, వంతెనలు, నేషనల్ హైవే రోడ్లు, ఎస్సారెస్పీ కాలువల కోసం సేకరించిన స్థలం, పరిశ్రమలు, వ్యాపార నిర్వహణ, నాలా కన్వర్షన్ భూముల పూర్తి వివరాలు ఆన్‌లైన్ చేస్తున్నారు. దీనిలో భాగంగా బొమ్మకల్, చేగుర్తి, దుర్శేడ్, ఎలబోతారం, ఇరుకుల్ల, జూబ్లీనగర్, నగునూరు, నల్లగుంటపల్లి గ్రామాల్లోని మొత్తం 36.35 ఎకరాల వివరాలను ఆన్‌లైన్ చేశారు. వ్యవసాయేతర భూముల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ శనివారం వరకు పూర్తిచేయనున్నట్లు అధికారులు తెలిపారు.



ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్న తహసీల్దార్ రాజు, ఏవో సత్యం తదితరులు

### రోడ్డు పనులు అడ్డగింత

శంకరపట్నం: జాతీయ రహదారి నిర్మాణం కోసం వ్యవసాయ భూమి సేకరించి పరిహారం తక్కువ చెల్లించారని మండలంలోని తాడికల్‌లో గురువారం ఓ రైతు రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్నాడు. ఇప్పలపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్, రైతు వెంగళశ్రీనివాస్‌కు తాడికల్ శివారులో సర్వే నంబర్ 166లో 23 గుంటల వ్యవసాయభూమి ఉంది. ఇప్పలపల్లి శివారులో 188 కోసం పైప్‌లైన్ వేశాడు. తాడికల్ గ్రామానికి చెందిన రైతులకు గుంటకు రూ.56,000 పరిహారం రాగా తనకు రూ.35,000 పరిహారం ఇచ్చారని ఆరోపించారు. తహసీల్దార్ భాస్కర్ క్షేత్రస్థాయిలో పనులు చేపట్టగా జేసీబీతో పనులు చేయకుండా రైతు అడ్డుకోవడంతో సమాచారం అందుకున్న బ్లూకోల్ట్స్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఇతర రైతులకు ఇచ్చిన విధంగా పరిహారం చెల్లించాలని తహసీల్దార్‌ను ప్రాధేయపడ్డాడు. వివాదం ముదరడంతో శ్రీనివాస్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### బెంగళూరు ప్రయాణికులకు బస్సు చార్జీలో 10 శాతం రాయితీ

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్, గోదావరిఖని డిపోల నుంచి బెంగళూరుకు నడిచే బస్సు సర్వీసుల్లో బెంగళూరు వరకు ప్రయాణించే వారికి బస్‌చార్జీలో 10 శాతం రాయితీ కల్పించినట్లు కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాయితీ సౌకర్యాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### 'నరేందర్ రెడ్డిపై దుష్ప్రచారం తగదు'

కరీంనగర్‌కల్చరల్: కాంగ్రెస్ పార్టీ బలపర్చిన పట్టభద్రుల శాసనమండలి అభ్యర్థి నరేందర్‌రెడ్డిపై సామాజిక మాధ్యమాల వేదికగా కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని గౌడ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పులి లక్ష్మీపతిగౌడ్ ఖండించారు. గురువారం కరీంనగర్‌లోని వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 27న జరగనున్న శాసనమండలి ఎన్నికల్లో విద్యావంతుడు, విద్యావంతుల పరిస్థితులు తెలిసిన నరేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీల్లో విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధులు ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. కేవలం అల్ఫోర్స్ అధినేత విషయంలో కొందరు పని కట్టుకొని చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని హితవు పలికారు.

### రాజ లింగమూర్తి హత్యపై న్యాయ విచారణ జరిపించాలి

విద్యానగర్(కరీంనగర్): భూపాల్‌పల్లి జిల్లా కేంద్రంలో సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి దారుణహత్యపై న్యాయ విచారణ జరిపించి దోషులను శిక్షించాలని కరీంనగర్ వినియోగదారుల మండలి సభ్యులు, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ప్రతినిధులు కోరారు. గురువారం కరీంనగర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ ఏడో బ్లాక్ ఏజీ కుంగుబాటుపై రాజలింగమూర్తి చేసిన న్యాయపోరాటానికి అధికారులు, రాజకీయ నాయకులు కక్షగట్టి హత్య చేయడాన్ని ఖండించారు. ఈ సమావేశంలో వినియోగదారుల మండలి, లోక్‌సత్తా ఉద్యమ సంస్థల బాధ్యులు ఆర్.వెంకటేశ్వర్‌రావు. ప్రకాశ్‌హోల్లా, చంద్ర ప్రభాకర్. కోల రామచంద్రారెడ్డి. ముజఫర్, గంగాధర్. గంగారావు, మనోహర్. లక్ష్మారెడ్డి, లక్ష్మణ్‌కుమార్. రఘురాం, కేఎస్. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### క్షేత్ర సందర్శన

గన్నేరువరం: మండలంలోని వ్యవసాయశాఖ అధికారులు, ఫర్టిలైజర్ డీలర్లు పంటల సాగుపై గురువారం మండలంలోని రెండు గ్రామాల్లో క్షేత్రస్థాయి సందర్శన కార్యక్రమం నిర్వహించారు. కరీంనగర్‌లోని రైతు శిక్షణ కేంద్రం ఆత్మ ఆధ్వర్యంలో మండలకేంద్రం గన్నేరువరం, ఖాసీంపేట గ్రామాలకు చెందిన ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ డీలర్లు సందవేని ప్రశాంత్, బద్దం మహిపాల్‌రెడ్డికి ఏడాది డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ కోర్సు శిక్షణ ఇచ్చారు. అలాగే ప్రశాంత్, మహిపాల్‌రెడ్డిలు సాగు చేస్తున్న మొక్కజొన్న, బొప్పాయి పంటలను పరిశీలించి, చీడపీడల నివారణ, సస్యరక్షణ చర్యలు డీసీస్ ఫెసిలిటేటర్ రామచందర్‌రావు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి కిరణ్మయి, రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి మమత, ఆత్మ బీటీఎం స్రవంతి, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

### గోపాల్‌రావుపేటలో చోరీ

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన గోలి మధుసూదన్‌రెడ్డి ఇంటిలో చోరీ జరిగింది. ఎస్సై వి. శేఖర్ తెలిపిన వివరాలు.. గత బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని, పది తులాల బంగారం, రూ.రెండులక్షలు ఎత్తుకెళ్లారని బాధితుడి ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

### శ్రీచైతన్యలో 'ఫ్యామిలీ బ్లూమ్'



కరీంనగర్: బోయవాడలోని శ్రీచైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం ఫ్యామిలీ బ్లూమ్ నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ న్యాలకొండ పద్మజ మాట్లాడుతూ పిల్లలకు కుటుంబ ప్రేమాభిమానాలు, బాధ్యతలు, తల్లిదండ్రులు పడుతున్న తపన, వారి ఎదుగుదల కోసం కృషి చేస్తున్న విధానంను తెలియపర్చడం ముఖ్య ఉద్దేశమన్నారు. పిల్లలు తల్లిదండ్రులకు బహుమతులను ఇచ్చి వారి దగ్గర ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం రాజు, కోఆర్డినేటర్ ప్రవీణ్, డీన్ విజయకృష్ణ, స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీలత, విశాలి, జోనల్ పీఈటీ శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కరీంనగర్ కార్పొరేషన్: నగర పాలక సంస్థ 30వ డివిజన్ పరిధిలోని మారుతినగర్‌లో 6 నెలలుగా వాటర్ పైప్‌లైన్ తరచూ లీకవుతోంది. దీంతో నీరంతా వీధుల్లో చేరుతోంది. ఫలితంగా ఇళ్లకు వస్తున్న తాగునీరు కలుషితమవుతోంది. పైప్‌లైన్ లీకేజీ సమస్యకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి.

– ధనపురి సాగర్, మారుతినగర్

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
వెంకటేశ్వర్లు, డీఈ, 89199 23123

### వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 94400 77555

## బీజేపీతోనే సమస్యలు పరిష్కారం

కరీంనగర్‌టౌన్: ఉపాధ్యాయుల, పట్టభద్రుల సమస్యలు పరిష్కారం కావాలంటే అది భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని నగర మాజీ మేయర్ సునీల్‌రావు అన్నారు. గురువారం బీజేపీ కార్యకర్తలతో కలిసి నగరంలోని కాశ్మీర్‌గడ్డ ఉమెన్స్ డిగ్రీ కళాశాల, 33వ డివిజన్ భగత్‌నగర్ భగవతి స్కూల్, ట్రినిటి కళాశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. నేరుగా పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి బీజేపీ చేపట్టిన దేశ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఈ ఎన్నికల ప్రచారంలో బీజేపీ మాజీ కార్పొరేటర్ శ్రీదేవి చంద్రమౌళి, నాయకులు కన్నం శ్రీనివాస్, అశోక్, ఉపేందర్, కిరణ్, బాలు తదితరులు పాల్గొన్నారు.



ఓటు అభ్యర్థిస్తున్న మాజీ మేయర్ సునీల్‌రావు

## ఉద్యమ నాయకులను గెలిపించాలి

కరీంనగర్: ఉపాధ్యాయ సమస్యలపై అవగాహన ఉన్న ఉద్యమనాయకుడు వై.అశోక్‌కుమార్‌ను ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర నాయకుడు కోల రామల్లు అన్నారు. గురువారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రియల్ ఎస్టేట్, కార్పొరేట్ వ్యాపారాలు చేస్తున్న అభ్యర్థులను గెలిపిస్తే ప్రభుత్వ విద్యారంగానికి ఎలాంటి లాభం చేయరని అన్నారు. 35 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ జేఏసీ చైర్మన్‌గా ఉద్యమంలో పాల్గొని ఉపాధ్యాయ రంగసమస్యలపై పూర్తి అవగాహన కలిగిన అశోక్‌కుమార్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ సమావేశంలో టీపీటీఎఫ్ నాయకులు పంజాల లచ్చయ్య, నేదునూరి కనకయ్య, దేవదానం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజమల్లు

## ఎస్టీయూ నాయకుల ఇంటింటి ప్రచారం

కరీంనగర్: ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో భాగంగా గురువారం ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పర్వత రెడ్డి, సదానందం గౌడ్‌లు ఇంటింటి ప్రచారం చేశారు. శాసనమండలి ఎన్నికల్లో సంఘం బలపరుస్తున్న అభ్యర్థి రఘోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. విద్య, ఉపాధ్యాయ సమస్యలు, సర్వీస్ నిబంధనల గురించి అవగాహన ఉన్న ఉపాధ్యాయుడిని ఓటు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు పిన్నింటి తిరుపతిరావు, దాసరి శ్రీధర్, కోట శ్యాంకుమార్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న ఎస్టీయూ నాయకులు

## విద్యారంగం బలోపేతానికి కృషి

కరీంనగర్: శాసనమండలి ఎన్నికల్లో తనను గెలిపిస్తే విద్యారంగం బలోపేతానికి కృషి చేస్తానని టీచర్ ఎమ్మెల్సీ పీఆర్‌టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం, ఆర్‌యూపీపీ, మహిళా విభాగం, ఇతర సోదర సంఘాలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై అవగాహన లేని వారు పదవుల కోసం ఎన్నికల్లో నిలబడ్డారని, వారితో విద్యారంగం అధోగతి పాలవుతుందని అన్నారు. పీఆర్‌టీయూ సంఘం వేలాది మంది ఉపాధ్యాయులకు వందలాది జీవోలు ఇప్పించి అండగా నిలిచిందని గుర్తు చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే పీఆర్‌టీయూ అండతో ఉపాధ్యాయ లోకానికి బాసటగా నిలుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పేటా సంఘం, ఆర్‌యూపీపీ, కేజీబీవీ, రెసిడెన్షియల్, మహిళ జేఏసీ,ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పోస్టల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

హుజూరాబాద్: పోస్టల్ ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పోస్టల్ ఉద్యోగుల గ్రూప్–సీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉకంటి మహేందర్ అన్నారు. గురువారం పోస్టాఫీస్ ఎదుట ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. పోస్టల్ చట్టం 2023 వల్ల సేవలు ప్రైవేట్, కార్పొరేట్ పరం కానున్నాయని, ప్రజల గోప్యతకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని, గ్రామీణ డాక్ సేవకులకు రెగ్యులర్ హోదా కల్పించి పెన్షన్, గ్రాట్యూటీ, ఆరోగ్య పథకం వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. మార్చి 18 నుంచి పోస్టల్ ఉద్యోగుల దేశవ్యాప్త నిరవధిక సమ్మె కొనసాగుతుందన్నారు. నిరసనలో గ్రూప్–సీ బ్రాంచ్ కార్యదర్శి జక్కు రజినీకాంత్, మాజీ కార్యదర్శి చందనాల గోపి కిషన్, బత్తిని రాజకుమార్, చిలుకమారి ప్రవీణ్, కోలా సందీప్, సామల వేణుగోపాల్, శివసింగ్, గ్రూప్–డీ డివిజన్ కార్యదర్శి తిరుపతి నాయక్, సంకటి హరీశ్, గ్రామీణ డాక్ సేవక్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఊకంటి మహేందర్

# రైతు భరోసా కొందరికేనా..?

- పూర్తిస్థాయిలో అందని పెట్టుబడిసాయం
- మూడు ఎకరాలకే పరిమితం
- పట్టించుకోని అధికారులు

కరీంనగర్‌రూరల్: రైతు భరోసా పథకం కింద అన్నదాతలకు పూర్తిస్థాయిలో పెట్టుబడి సాయం అందడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మూడు ఎకరాల వరకు భూమి ఉన్న రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేశామని ప్రకటించినప్పటికీ అంతకంటే తక్కువ ఉన్న కొంత మంది రైతులకు జమ కాలేదు. మరికొందరు రైతులకు ఉన్న భూమిలో సగం విస్తీర్ణానికి మాత్రమే జమైంది. దీంతో పెట్టుబడి సాయం మంజూరుపై రైతులు ఆందోళన చెందుతున్నారు. బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ ఎవరూ సరైనా సమాచారం ఇవ్వకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు.

**మండలానికో గ్రామం ఎంపిక**

రైతు భరోసా కార్యక్రమం కింద పెట్టుబడి సాయం మంజూరు కోసం ప్రభుత్వం జనవరి 26న శ్రీకారం చుట్టింది. మండలానికో గ్రామం చొప్పున కరీంనగర్ మండలంలో బహుదూర్‌ఖాన్‌పేట గ్రామాన్ని ఎంపిక చేశారు. చామనపల్లి రెవెన్యూ పరిధిలోని బహుదూర్‌ఖాన్‌పేట, దుబ్బపల్లి గ్రామాల్లోని 1,140 మంది రైతులకు రూ.1,17,33,663 పెట్టుబడి సాయం బ్యాంకుఖాతాల్లో జమయ్యాయి. అనంతరం ఫిబ్రవరి 5 నుంచి మిగతా గ్రామాల్లోని రైతులకు జమ చేయడం ప్రారంభించింది. ఇప్పటివరకు కేవలం మూడు ఎకరాల వరకు మాత్రమే పెట్టుబడిసాయం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించగా ఇంకా చాలామంది రైతులు నగదు జమ కాలేదని ఆరోపిస్తున్నారు.

**సగం విస్తీర్ణానికే సాయం**

కొందరు రైతులకు ఎకరంలోపు భూమి ఉన్నప్పటికీ రైతుభరోసా మంజూరు కాలేదని పేర్కొంటున్నారు. మరికొందరు రైతులు తమకు ఉన్న భూమిలో సగానికి మాత్రమే వచ్చిందని తెలిపారు. సంబంధిత ఏఈవోలను సంప్రదిస్తే తమ వద్ద ఏమి లేదని చెబుతున్నారు. చెర్లభూత్కూర్‌లో గుజ్జుల కవిత అనే మహిళా రైతుకు 35 గుంటల భూమి ఉండగా కేవలం 22గుంటలకు రూ.3,200 మాత్రమే బ్యాంకు ఖాతాలో జమైంది. ఇంకా 16గుంటలకు డబ్బులు రాలేదు. ఇంకా పలువురి రైతులది ఇదే పరిస్థితి. గతంలో ఎప్పుడు ఈ పరిస్థితి రాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. అయితే వ్యవసాయాధికారులు మాత్రం తమ దగ్గర ఎలాంటి సమాచారం లేదని చేతులెత్తేయడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.



తాహెర్‌కొండాపూర్‌లో సాగుచేసిన వరి పంట

**కరీంనగర్ మండలంలో రైతు భరోసా వివరాలు**

| | |
|---|---|
| మొత్తం రైతులు | 11,048 |
| జమ కావాల్సిన నిధులు | రూ.1,17,92,612 |
| 3 ఎకరాలు జమైన రైతులు | 8,056 |
| ఇప్పటివరకు జమైన మొత్తం | రూ.50,352,493 |
| ఇంకా రావాల్సిన రైతులు | 2,992 |
| ఇంకా జమ చేయాల్సిన మొత్తం | రూ.38,559,881 |